క్లుప్తంగా

కాపాడు తల్లీ గంగమ్మా..



విశేషాలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: కాపాడు తల్లీ.. కరుణించు తల్లీ.. చల్లంగా చూడు తల్లీ అంటూ చిన్నగొట్టిగల్లులో తిరుపతి గంగమ్మకు మహిళలు పెద్దఎత్తున బోనాలు తీసుకొచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామంలో మహిళలు తెల్లవారుజాము నుంచే బోనం వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున భక్తులు గంగజాతర సందర్భంగా పలు వేషాలు వేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని బోనం సమర్పించి భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

శ్వేతకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ జాగ్రఫీ విభాగం పరిశోధక విద్యార్థి కె.శ్వేతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె రిటైర్డ్ ప్రొఫెసర్ జి.జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో మోర్ఫోలాజికల్ స్టడీ ఆఫ్ పులియేరు రివర్ బేసిన్, అనంతపురం డిస్ట్రిక్ట్, ఏపీ, యూజింగ్ రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

డాక్టర్ ఆనంద్ బాబుకు పీహెచ్‌డీ



తిరుపతి తుడా : స్విమ్స్ పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ ఆనంద్ బాబుకు ఢిల్లీ హిమాలయ గర్వాల్ యూనివర్సిటీ వైద్యరంగంలో పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీలో క్లినికల్ సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ విభా ద్వివేది పర్యవేక్షణలో ఆల్కహాల్ అడిక్షన్ ట్రీట్మెంట్‌పై 'ఆల్కహాల్ అండ్ సబ్ స్టాన్ యూజ్ ఇన్ హ్యూమటేరియన్ అండ్ పోస్ట్ కాంప్లిట్ సిట్యువేషన్ అసెస్మెంట్'అనే అంశంపై పరిశోధన పత్రాలను సమర్పించారు.

నగరంలో నేడు

తిరుపతి కల్చరల్: నగరంలో అన్నమాచార్యుల జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు జరుగుతుంది. అలాగే సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో భక్తిసంగీత విభావరి ఉంటుంది. శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వసంతోత్సవాల ముగింపు సందర్భంగా మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం ఉంటుంది.

ఆచరణీయం అన్నమయ్య భక్తిమార్గం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు



భక్తి సంకీర్తనల కచేరి ప్రదర్శిస్తున్న ప్రముఖ సంగీత విద్వాంసురాలు పంతుల రమ బృందం



సంకీర్తనలు గానం చేస్తున్న సాయిపద్మజ బృందం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక మార్గం ద్వారా సామాజిక స్పృహ పెంచేందుకు అన్నమయ్య కీర్తనలను ఒక ఆయుధంగా మలుచుకున్నారని, తద్వారా సామాన్య ప్రజలకు భగవంతుని తత్వాన్ని బోధించారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు తెలిపారు. తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న సాహితీ సదస్సులు మంగళవారంతో ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన చిన వీరభద్రుడు అన్నమయ్య –ఆర్ష సంస్కృతి అనే అంశంపై ఉపన్యసించారు. ఆరు శతాబ్దాలకు పూర్వం ఉన్న సామాజిక, రాజకీయ పరిస్థితులను చక్కదిద్దడానికి అన్నమయ్య గాన మార్గంలో పరిష్కరణలను సూచించారన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారిని భక్తితో సేవిస్తే రాజులైన, ప్రజలైనా మోక్షం పొందుతారని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లారని తెలిపారు. అన్నమయ్య ఆనాడు సూచించిన భక్తి మార్గం నేటికీ ఆచరణీయమని, ఆదర్శనీయమన్నారు. అనంతరం ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ రఘునాథ శర్మ అన్నమయ్య– భక్తి తత్వం అనే అంశంపై మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల్లో భక్తిని గురించి చాలా విస్తృతంగా రాశారన్నారు. విశాఖపట్నంకు చెందిన విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఇందిర అన్నమయ్య– హనుమత్సం కీర్తనలు అనే అంశంపై ప్రసంగిస్తూ శ్రీవైష్ణవ ఆలయాల్లో స్వామికి దగ్గరగా గరుడాళ్వార్, ఆలయానికి బయట శ్రీఆంజనేయస్వామివారు ఉంటారన్నారు. ఇప్పటి వరకు లభించిన 14 వేల అన్నమయ్య సంకీర్తనలలో 55 హనుమత్సం కీర్తనలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ అతిథులను శాలువ, శ్రీవారి ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్వేత సంచాలకుడు భూమన సుబ్రమణ్యంరెడ్డి, ఉప సంపాదకుడు డాక్టర్ నరసింహాచార్యుడు, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తన్మయత్వం.. అన్నమయ్య సంకీర్తనామృతం

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో మంగళవారం సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసులు గానం చేసిన అన్నమయ్య సంకీర్తనామృతం యావత్ భక్తజనాన్ని తన్మయత్వంతో పులకింపజేసింది. అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పలువురి సంగీత విద్వాంసుల గాత్ర కచేరీ ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో భాగంగా విశాఖపట్నంకు చెందిన పంతుల రమ బృందం ఆలపించిన సంకీర్తనలతో భక్తుల హృదయాలు భక్తి పారవశ్యంతో పులకించాయి. తిరుపతికి చెందిన సాయిపద్మజ బృందం ప్రదర్శించిన భక్తి సంగీతాలాపన సభికులను రంజింపజేసింది. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, కళాకారులను శాలువ, శ్రీవారి ప్రసాదాలతో సత్కరించి అభినందించారు.

రుతుక్రమంపై అవగాహన



యువతులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాకాల : మండలంలోని మొగరాల అంగన్‌వాడీ కేంద్రంలో రుతుక్రమం యుక్తవయస్సు బాలికలకు రుతుక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఐసీడీఎస్ తిరుపతి ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో రుతుక్రమ అవగాహన డే సందర్భంగా కిషోర బాలికలకు రుతుక్రమ సమయంలో తీసుకోవలసిన ఆహార పదార్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ వంటి చర్యలపై అవగాహన కల్పించారు. ఈ నియమాలను పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలియని యువతులకు అవగాహన కల్పించి వారిలో మార్పు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, కిరణ్మయి, అంగన్‌వాడీ కార్యకర్తలు షమీమ్, లలిత, ఝాన్సీరాణి, రేఖ, ధనలక్ష్మి, భారతి, సీహెచ్‌ఓ శిరీష, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే సీఎం

- శ్రీవారి సేవలో ఎంపీ గోరంట్ల మాధవ్



ఆలయం వెలుపల ఎంపీ గోరంట్ల మాధవ్

తిరుమల: మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ఆంధ్రప్రదేశ్‌కు సీఎం అవుతారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ తెలిపారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయంటేం.. మళ్లీ సీఎంగా జగన్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రశాంత్ కిషోర్ మాటలకు., మంత్రాలకు చింతకాయలు రాలవన్నారు. ఓ పార్టీలో చేరి సక్సెస్ అవ్వాలని అనుకున్న ప్రశాంత్ కిషోర్ భవితవ్యం శకునం పలికిన బల్లి కుడితిలో పడ్డట్టు మారిందని ఎద్దేవా చేశారు. ప్రశాంత్ కిశోర్ మాటలు నమ్మి టీడీపీ నాయకులు కోట్లలో బెట్టింగ్ చేస్తున్నారనిం గెలిచేది వైఎస్సార్‌సీపీనే అని ధీమా వ్యక్తం చేశారు. 2019లో వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం కానున్నాయన్నారు. తమ నాయకుడు గెలిచే సీట్లతో పాటు, ప్రమాణ స్వీకారానికి డేట్, టైం ఫిక్స్ చేశారని అన్నారు. ప్రజలను మభ్యపెట్టే చంద్రబాబుకు అలా చెప్పే ధైర్యం లేదన్నారు. అసెంబ్లీలో 151కి పైగా.. 22 ఎంపీ స్థానాలను తమ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. పెట్టుకున్న ముహూర్తంలో ప్రమాణస్వీకారం సీఎం జగన్ చేయడం ఖాయమని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి అత్యధిక సీట్లు ఖాయం

- ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



తిరుమల ఆలయం వెలుపల డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి

తిరుమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక సీట్లు ఖాయమని ఏపీ డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి తెలిపారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీకి ఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లు రావడం ఖాయమన్నారు. ఈవీఎం ట్యాంపరింగ్ అనేది టీడీపీ అభూత కల్పితం మాత్రమేనని స్పష్టం చేశారు. 2019లో అధికారంలో ఉన్న చంద్రబాబు ఎందుకు ఈవీఎం ట్యాంపరింగ్ చేయలేక పోయారని ప్రశ్నించారు. గెలిస్తే ప్రజల మద్దతుం ఓడితే ఈవీఎం ట్యాంపరింగ్ అంటూ చంద్రబాబు మాయమాటలు మాట్లాడుతారని అన్నారు. ప్రజామద్దతు ఉన్నట్లు కేవలం టీడీపీ భ్రమ కల్పించే ప్రయత్నం చేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ చేసిన దౌర్జన్యాలు ప్రజలు గమనించారని అన్నారు. ఎలాగో ఓడిపోతున్నారు గనుక దౌర్జన్యాలు చేయండి అని చంద్రబాబు ఆ పార్టీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు.

కౌంటింగ్‌కు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ: వచ్చే నెల 4వ తేదీన ప్రారంభమయ్యే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన అనంతరం ఆయన కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కొనసాగుతోందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలలో భద్రతతో పాటు అన్ని సౌకర్యాలను ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వర్సిటీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు ఇచ్చి నష్టపోయాం



మాట్లాడుతున్న డాక్టర్ చింతామోహన్

తిరుపతి కల్చరల్: కమ్యూనిస్టులకు అవకాశం ఇవ్వడంతో తిరుపతిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే స్థానాన్ని కోల్పోతున్నామని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టులంటే తనకు చాలా ఇష్టమని, అయితే ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీటు కంకీ కొడవలికి కట్టబెట్టడంతో నష్టపోతున్నామని తెలిపారు. ప్రజల ఆదరణతో తిరుపతి ఎంపీ సీటు గెలవబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రాష్ట్ర రాజధానిగా తిరుపతిని చేయాలని తాను డిమాండ్ చేసిన విషయం తెలిసిందేనన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక ప్రభుత్వం రానుందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తో సాధ్యమని తెలిపారు.



పొంగళ్లు వండుతున్న భక్తులు



గంగమ్మకు మరు పొంగళ్లు..

చల్లంగా చూడు గంగమ్మ తల్లీ అంటూ భక్తులు శ్రీతాతయ్యగుంట గంగమ్మకు మొక్కుకున్నారు. మంగళవారం ఆలయంలో మరు పొంగళ్లు పెట్టి ప్రణమిల్లారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లతో మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో గంగమ్మ ఆలయం కిటకిటలాడింది. - తిరుపతి కల్చరల్

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వవిప్ ప్రసాద్ రాజు



లవ్ మీ సినిమా టీం హర్షిత్ రెడ్డి, ఆశిష్ రెడ్డి



పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం ప్రభుత్వ విప్ ప్రసాద్రాజు, పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు, లవ్ మీ సినిమా టీం హర్షిత్ రెడ్డి, ఆశిష్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.